క్లుప్తంగా

యూరియా కష్టాలు



ఖానాపురం : మండల రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. ధర్మరావుపేట, ఖానాపురం గ్రామాల్లో రైతులు రైతువేదికల వద్ద శుక్రవారం బారులు దీరారు. బాలుతండా, ధర్మరావుపేట, ఖానాపురంలో మూడ్రోజులుగా రైతులు యూరియా కోసం తెల్లవారుజాము నుంచే క్యూలో నిల్చుంటున్నారు. యూరియా రావడం లేదని తెలుసుకుని ఇంటి బాట పడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సరిపడా యూరియా అందించాలని మండల రైతులు కోరుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ఖానాపురం : మండలంలోని బుధరావుపేటకు చెందిన సుష్మ, రాజశేఖర్‌లకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు లింగిడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ బిక్కి లింగమ్మ మురళి శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. పేదలను సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. పేదలు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు చెలిపాక ఉపేందర్, నాయకులు లాల్ సాహెబ్, గిరగాని నర్సయ్య, చాంద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాల మాజీ హైస్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ కొమ్మ రవి రజిత దంపతుల కుమార్తె దీక్షిత హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించగా ఆమెను బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం శాలువా కప్పి పూలబొకే అందించి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిన్నపెల్లి నర్సింగం, మాజీ ఎంపీటీసీ బండారు శ్రీలత రమేశ్, న్యాయవాది మోటూరి రవి, నాయకులు అన్న రాజమల్లు, కొమురయ్య, రాయపురెడ్డి, అల్లి రవి, మంచిక హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

గుడి గంట చోరీ



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మాధన్నపేట చెరువు కట్టపై నిర్మించిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని గుడి గంట చోరీకి గురైంది. శుక్రవారం ఉదయం భక్తులు ఆలయానికి రాగా చోరీ వెలుగులోకి వచ్చింది. ఆలయ కమిటీ బాధ్యులు మాడిశెట్టి భాస్కర్ స్థానికులతో కలిసి టౌన్ సీఐ రఘుపతిరెడ్డికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాధన్నపేట చెరువు ఈత సంఘం అధ్యక్షుడు కొల్లూరి లక్ష్మీనారాయణ, నాయకులు గోల్యానాయక్, ఆకుతోట రాజేందర్, రాకేష్, విజయ్, సంతోష్ కుమార్, చిదురాల శరత్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



రమేశ్ (ఫైల్)

సంగెం : చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తీగరాజుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తీగరాజుపల్లికి చెందిన బుట్టి రమేశ్ (35) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రమేశ్, అతని కుమార్తె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నా ఉపశమనం లభించలేదు. దీంతో రమేశ్ జీవితంపై విరక్తి చెంది ఈనెల 17న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆయన్ను తొలుత వరంగల్‌లోని ఆస్పత్రిలో, అనంతరం హనుమకొండలోని ఆస్పత్రిలో చేర్చారు. రమేశ్ గురువారం మృతి చెందాడు.

చెరువులో పడి మహిళ..

నర్సంపేట రూరల్ : మండలంలోని నర్సినాయక్‌తండాకు చెందిన కొర్ర రాజమ్మ (56) మతిస్థిమితం కోల్పోయి మాధన్నపేట చెరువులో పడి మహిళ మృతి చెందింది. శుక్రవారం సాయంత్రం చెరువులో మృతదేహం కనిపించగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రవికుమార్ మృతదేహాన్ని వెలికితీయించి నర్సినాయక్‌తండాకు చెందిన రాజమ్మగా గుర్తించి బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మొరం టిప్పర్లతో రోడ్డు ధ్వంసం

- గుంతలతో తరచూ ప్రమాదాలు

నల్లబెల్లి : మండలంలోని మేడపల్లి నుంచి ఇటుకాలపల్లి క్రాస్ రోడ్డు వరకు ఉన్న రహదారిపై వాహనాల రద్దీ పరిపాటి. మేడపల్లి శివారులోని రామారావుతండా నుంచి ఇటుకాలపల్లి క్రాస్ రోడ్డులోని జాతీయ రహదారి వరకున్న రోడ్డు పూర్తిగా ధ్వంసం అయ్యింది. అయినా మరమ్మతులు చేపట్టే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రామారావుతండా నుంచి నర్సంపేటకు ఓవర్ లోడ్‌తో టిప్పర్లలో కొందరు అక్రమార్కులు మొరం తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే రోడ్డు ధ్వంసం అవుతోంది. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ల వల్ల రోడ్డు శిథిలమై గుంతలు పడి తరచూ ప్రమాదాలు చోటు చేసుకుని వాహనదారులు ఆస్పత్రుల పాలవుతున్నారు.



గుంతలమయమైన ఇటుకాలపల్లి క్రాస్ నుంచి మేడపల్లికి వెళ్లే రోడ్డు

అధికారుల నిర్లక్ష్యం

రామారావుతండా నుంచి నర్సంపేటకు ఈ రోడ్డు మీదుగా అక్రమంగా మట్టి తరలిస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. గ్రామస్తులు లారీలను అడ్డుకోగా మొరం దందాకు పాల్పడుతున్న అధికార పార్టీ నాయకులు పోలీసులను ఆశ్రయించడంతో అనుమతులు లేని అక్రమ వ్యవహారంలో తలదూర్చి రాజీ కుదిర్చినట్లు ప్రచారంలో ఉంది. ధ్వంసమైన రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతు చేయించాలని కోరినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మీడియా ఎదుట వాపోయారు. సమస్యపై పోలీసులు మధ్యవర్తిత్వం వహించిన విషయమై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెంటనే మరమ్మతు పనులు చేపట్టేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని మేడపల్లి, రాంపూర్ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

త్వరలో రోడ్డు నిర్మాణం

ఓవర్‌లోడ్ వాహనాలతో రోడ్డు ధ్వంసమైంది. ఇటుకాలపల్లి క్రాస్ నుంచి మేడపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.6 కోట్లు మంజూరు చేసింది. టెండరు ప్రక్రియ పూర్తి కాగానే నిర్మాణ పనులు చేపడతాం.

– రజనీకాంత్, పీఆర్ స్పెషల్ ఏఈ

నర్సంపేట రూరల్ : నివాళులర్పిస్తున్న నర్సంపేట ఎంపీడీఓ, ఉద్యోగులు



నర్సంపేట : చెన్నారావుపేటలో..



చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, చెన్నారావుపేట, నల్లబెల్లి, వర్ధన్నపేట, పర్వతగిరి, సంగెం, రాయపర్తి, తదితర మండలాల్లో శుక్రవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, రజక, ఇతర ప్రజాసంఘాల ప్రతినిధులు ఐలమ్మ చిత్రపటాలకు నివాళులర్పించారు.



నల్లబెల్లి : నివాళులర్పిస్తున్న తహసీల్దార్ కృష్ణ



వర్ధన్నపేటలో..



సంగెం : నివాళులర్పిస్తున్న అధికారులు, రజక సంఘం నాయకులు



రాయపర్తి : కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

పద్మశాలీలు ఐక్యతతో ముందుకు సాగాలి

- టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి

నెక్కొండ : పద్మశాలీ కులస్తులు ఐక్యతతో ముందుకు సాగాలని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి కోరారు. మండలంలోని పెద్దకొర్పోలులో పద్మశాలీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఎస్‌డీఎఫ్ నుంచి రూ.15 లక్షలు కేటాయించడంతో నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని కులాలకు ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గై లక్ష్మణ్, నాయకులు బొడ్డుపల్లి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రంజిత్‌రెడ్డి

బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని లింగాపురంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాల్నె వెంకన్న, మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా వేములపల్లి కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా మోహన్, హరీశ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శంకర్‌లింగం, ప్రధాన కార్యదర్శిగా ఎల్లయ్య, అధికార ప్రతినిధిగా రంజిత్, కార్యదర్శిగా మూగల కమలాకర్, కోశాధికారిగా వీరయ్య, కార్యవర్గ సభ్యులుగా భిక్షపతి, ఐలయ్య, లింగారెడ్డి, అల్లెపు భిక్షపతి, నర్సయ్య, భద్రు, వీరస్వామి, పాతు సుధాకర్, తిక్క రవి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నమిండ్ల సురేశ్, మహిళా ఉపాధ్యక్షురాలు రాజులపాటి ఉమ అశోక్, సొసైటీ వైస్ చైర్మన్ యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వండి

నర్సంపేట : పట్టణంలోని నెహ్రూ పార్కు డివైడర్ మధ్యలో పూలే దంపతుల విగ్రహం ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డ్యాగల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్ ఓర్సు తిరుపతి ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. నెహ్రూ పార్కు జంక్షన్‌లో కొన్నేళ్లుగా పూలే దంపతుల జయంతి, వర్ధంతితోపాటు పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆ ప్రాంగణాన్ని జ్యోతిరావుపూలే జంక్షన్‌గా నామకరణం చేసినట్టు తెలిపారు. పూలే దంపతుల విగ్రహ ఏర్పాటు కోసం గతేడది మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జీజుల సాగర్, మాజీ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్య గౌడ్, బీసీ సంక్షేమ సంఘం ఆర్టీసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల రవిగౌడ్, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు కడారి సురేశ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



సంగెం : ఆర్టీసీ బస్సు అదుపు తప్పిన ఘటన సంగెంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ నుంచి నెక్కొండ మండలంలోని చంద్రుగొండకు 40 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు సంగెం మండలంలోని తిమ్మాపూర్ సమీపంలోని తొమ్మిది మోరీల బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి బ్రిడ్జి రోడ్డు నుంచి ఎడమ వైపునకు కిందకు దూసుకుపోయింది. ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

సంస్కృతిని కాపాడుకోవాలి

పర్వతగిరి : గంగా జమున సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత కవులపైనా కాకుండా సమాజంలోని అందరిపైనా ఉందని ప్రముఖ కవి డాక్టర్ జిలుకర శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని అన్నారం షరీఫ్‌లో శుక్రవారం నిర్వహించిన 'అలాయ్ బలాయ్' కవి సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. అలాయ్ బలాయ్ కల్చర్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. దాన్ని ధ్వంసం చేయాలని మనువాదులు ఒకవైపు, ముస్లిము అతివాదులు మరోవైపు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రతీకగా అన్నారం దర్గా నిలుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కవులు యాకూబ్, లక్ష్మీనర్సయ్య, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ప్రసేన్, స్కైలాబ్, తాళ్లపల్లి యాకమ్మ, బండారి రాజ్‌కుమార్, వల్లకొండ దయాకర్, రాపాక శ్రీనివాస్, కేతిరెడ్డి యాకూబ్‌రెడ్డి, చిట్ల ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

తడిసిన మక్కలను కొనుగోలు చేయాలి

నర్సంపేట : మార్కెట్‌లో రైతులు ఆరబోసిన మక్కలు వర్షానికి తడిసిన క్రమంలో వాటిని ఆంక్షల్లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డీబీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మడి బాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని మార్కెట్లో తడిసిన మక్కలను, ధాన్యాన్ని వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి శుక్రవారం బాబు సందర్శించి పరిశీలించారు. అనంతరం బాబు మాట్లాడారు. మార్కెట్‌లో రైతులు మక్కలు ఆరబోసి కొనుగోలు కోసం ఎదురు చూస్తుండగా వర్షం కురవడంతో మక్కలు తడిసి దెబ్బతిన్నాయని తెలిపారు. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కల్తి వీరస్వామి, ఎలిగేటి భాస్కర్, కోడెపాక మొగిలి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబు

దుగ్గొండి : నేలవాలిన మొక్కజొన్న పంట



ఖానాపురం : మక్కలను ఆరబోస్తున్న రైతులు



అధిక వర్షాలతో అపార నష్టం

- దెబ్బతింటున్న పంటలు

దుగ్గొండి : మూడ్రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలతో మండలంలోని పంటలకు నష్టం వాటిల్లుతోంది. పత్తి పంట చేతికొచ్చే దశలో పత్తి బుగ్గలపై నీరు అధికంగా ఉండటంతో చేనుపైనే మొలకలు వస్తున్నాయి. చేనులోనే మొక్కజొన్న కంకుల నుంచి మొలకలు వస్తున్నాయి. అలాగే పొనకల్‌లో గురువారం రాత్రి గండు సమ్మక్క ఇంటి ప్రహరీ ఓవైపు పూర్తిగా కూలింది. ఆ సమయంలో ఇంట్లో సమ్మక్క లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. కొంత ఆస్తి నష్టం వాటిల్లింది. తనకు పరిహారం అందించి ఆదుకోవాలని సమ్మక్క ప్రభుత్వాన్ని కోరుతోంది.

తడిసిన మొక్కజొన్న

ఖానాపురం : వర్షాలతో మండల రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మక్కజొన్న సాగు చేస్తున్న రైతులు రోడ్లపై జొన్నలు ఆరబోయగా ఎడతెరపి లేని వర్షంతో జొన్నలు తడిసి దెబ్బతిన్నాయి. రంగు మారిన జొన్నలను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



దుగ్గొండి : పొనకల్‌లో కూలిన సమ్మక్క ఇల్లు

నర్సంపేట : అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



మహాలక్ష్మీదేవి అలంకరణలో దుర్గాదేవి

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఐదో రోజు సందర్భంగా దుర్గాదేవిని అర్చకులు శ్రీ మహాలక్ష్మీ రూపంలో అలంకరించారు. దుర్గాదేవిని దుగ్గొండి మండలంలోని నాచినపల్లి రామాలయంలో కరెన్సీ నోట్లతో, వర్ధన్నపేటలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. చెన్నారావుపేటలో మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని దుర్గాదేవికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.



నల్లబెల్లిలో..



దుగ్గొండి : నాచినపల్లి రామాలయంలో..



పర్వతగిరిలో..

ఎన్నికల నిర్వహణలో అవగాహన కీలకం



నర్సంపేట : మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్



పర్వతగిరి : మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్

సాక్షి నెట్‌వర్క్ : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అవగాహన కీలకమని అధికారులు తెలిపారు. జిల్లాలోని నర్సంపేట, చెన్నారావుపేట, దుగ్గొండి, ఖానాపురం, నెక్కొండ, నల్లబెల్లి, పర్వతగిరి, గీసుకొండ, రాయపర్తి మండలాల్లో ఎన్నికల రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు రాజీవ్, వేదవతి, స్పెషల్ ఆఫీసర్లు బాలకృష్ణ, శ్రీనివాసరావు, ఎంపీడీఓలు నల్ల శ్రీవాణి, లెక్కల అరుంధతి, కృష్ణవేణి, శంకర్‌నాయక్, సునీల్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, కిషన్‌నాయక్, పసరగొండ రవి, తహసీల్దార్ రాజ్‌కుమార్, ట్రైనర్లు పిన్నింటి బాలాజీరావు, వి.సుధీర్ బాబు, ఏపీఆర్.చారి, రమేశ్, సుధాకర్, సతీశ్ మాట్లాడారు. ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఓటింగ్, కౌంటింగ్, ఎన్నికల ఫారాలు నింపే విధానం, బ్యాలెట్ బాక్సుల వినియోగంపై వివరించారు.



దుగ్గొండి : మాట్లాడుతున్న శ్రీనివాసరావు



నెక్కొండ : మాట్లాడుతున్న ఎంపీడీఓ

ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడాలి

నర్సంపేట : పట్టణంలోని అటవీ శాఖకు సంబంధించిన ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకులు కన్నం వెంకన్న, వంగల రాగసుధ కోరారు. ఈ మేరకు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్‌ఓ)కు శుక్రవారం వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అటవీ శాఖకు చెందిన ప్రభుత్వ భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు చిరువ్యాపారులకు అద్దెకు ఇస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమిలో డబ్బాలు పెట్టిస్తూ తమ సొంత భూమిగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించి విచారణ చేపట్టి సదరు భూములను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి రాజా సాహెబ్, సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి పాల్గొన్నారు.



ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెంకన్న, నాయకులు